# ప్రజా సేవ నుంచి దూరంగా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల కోసం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం క్లస్టర్ల ఏర్పాటు పేరుతో వాటిని కుదిస్తున్నట్టు ప్రకటించింది. ఇప్పటికే పూర్తి స్థాయిలో కసరత్తు చేసింది. ఉదాహరణకు పొదలకూరు పంచాయతీలో 20 వేల జనాభాకు నాలుగు సచివాలయాలున్నాయి. వీటిని రెండుకు కుదించేందుకు రంగం సిద్ధమైంది. నేడు సేవలు కూడా అంతంతమాత్రంగా అందుతున్నాయి.

సాక్షి గ్రౌండ్ రిపోర్టు

- నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- సిబ్బంది సంఖ్య కుదింపు
- నాడు రూ.లక్షలు వెచ్చించి భవనాల నిర్మాణం
- కూటమి ప్రభుత్వంలో సేవలు అంతంతమాత్రమే..
- రకరకాల సర్వేలు, పనులతో సిబ్బంది బిజీ



గత ప్రభుత్వంలో సచివాలయం వద్ద ఇలా.. (ఫైల్)

పొదలకూరు మండలంలోని ఆర్‌వై పాళెం గ్రామానికి చెందిన సన్నకారు రైతు పేరు డి.అంజనేయులుకు (పేరు మార్చాం). వన్‌బీ, అడంగళ్‌లో పేరు తప్పు వస్తోంది. దీనిని సరిదిద్దాలంటూ సచివాలయంలో దరఖాస్తు చేసుకునేందుకు పదిరోజులుగా తిరుగుతున్నాడు. అక్కడ వీఆర్వో లేకపోవడంతో పొదలకూరు సచివాలయంలో దరఖాస్తు చేసునేందుకు వచ్చాడు. ఇక్కడ కూడా సిబ్బంది అందుబాటులో లేరని నిట్టూర్చుతూ వెళ్లాడు. గతంలో సచివాలయాలు ఇలా లేవని, వెంటనే పనులు జరిగేవని ఆవేదన వ్యక్తం చేశాడు.


నేడు వెలవెలబోతున్న సచివాలయం



ఈ చిత్రంలోని వ్యక్తి పొదలకూరు బిట్ - 4 ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు. తన పరిధిలోని బిట్ - 4 సచివాలయంలో సేవలు ఎలా ఉన్నాయో తెలుసుకునేందుకు వెళ్లారు. అయితే ఏడుగురు ఉద్యోగులు ఉండాల్సిన చోట ఒక మహిళా పోలీస్, డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. ఎంపీటీసీ ఆశ్చర్యపోయి వారితో మాట్లాడుతూ మిగిలిన సిబ్బంది ఎక్కడని ప్రశ్నించారు. ఎనర్జీ అసిస్టెంట్ సబ్‌స్టేషన్‌కు వెళ్లాడని, వీఆర్వో రెవెన్యూ కార్యాలయంలో ఉన్నాడని, సర్వేయర్ కొలతలకు వెళ్లాడని, మిగిలిన వారు రకరకాల కారణాలతో బయటికు వెళ్లినట్టు వెల్లడించారు. దీంతో ఎంపీటీసీ రేషన్‌కార్డుల ఈకేవైసీ ఎలా ఉందని, అందుబాటులో ఉన్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని, పొదలకూరు పంచాయతీలో నాలుగు సచివాలయాలుంటే రెండింటినే కొనసాగించే పరిస్థితి ఉందన్నారు. సేవలు కూడా సక్రమంగా అందడం లేదని, సిబ్బంది సైతం ప్రజలకు అందుబాటులో లేరన్నారు. ఉద్యోగులను కూడా కుదించే ప్రక్రియ పూర్తయినట్టు వాపోయారు.


పొదలకూరు బిట్ - 4 సచివాలయం



ఈ చిత్రంలోని వ్యక్తి పేరు జి.వేణుగోపాల్. మండలంలోని మొగళ్లూరు గ్రామవాసి. పదిరోజుల క్రితం తిరుపతి అరవింద నేత్రాలయలో కంటికి శస్త్రచికిత్స చేయించుకున్నాడు. తరచూ సచివాలయం పక్కనున్న విలేజ్ హెల్త్ క్లినిక్‌కు వెళ్లి షుగర్, బీపీ టెస్ట్‌లు చేయించుకుంటారు. అక్కడున్న ఎంపీహెచ్‌ఓ ఉన్న ముందులు, పరీక్షలతోనే సేవలందిస్తున్నారు. అయితే అవసరమైన మందులు లభ్యం కాకపోగా షుగర్, బీపీకు సంబంధించిన మందులు కూడా సరిపడా అందజేయలేకపోతున్నారు. వేణుగోపాల్ మాట్లాడుతూ గతంలో కూడా ఇక్కడికి వచ్చేవాడనని రకరకాల మందులు, టెస్ట్‌లు ఉండేవన్నారు. ఇప్పుడు ఉన్న మందులతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరి మందుల సంఖ్యను పెంచి ఆదుకోవాలన్నారు.



మొగళ్లూరు విలేజ్ హెల్త్ క్లినిక్

పొదలకూరు: గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపమైన సచివాలయాలు కూటమి ప్రభుత్వంలో వెలవెలబోతున్నాయి. సంక్షేమ పథకాలను అమలు చేయకపోవడంతో వాటికి వైపు ప్రజలు వెళ్లడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేయడంతో ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు పెద్ద ఎత్తున జనం వెళ్లేవారు. అంతేకాక వలంటీర్లు తాము సేకరించిన సమాచారాన్ని నమోదు చేయించేందుకు వస్తూ.. వెళ్తూ ఉండటంతో సచివాలయ భవనాలు కళకళలాడుతుండేవి. ఇప్పుడు అలాంటి పరిస్థితుల్లేవు. అన్ని రకాల సేవలు కూడా అందుబాటులో లేకపోవడంతో ప్రజలు వెళ్లడం తగ్గించేశారు. దీంతో కొందరు సిబ్బంది సైతం సమయపాలన పాటించడం లేదు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ప్రశ్నిస్తే వివిధ రకాల సర్వేలతో సతమతమవుతున్నామని అందుకోసమే కార్యాలయాలకు సకాలంలో వెళ్లడం లేదని చెబుతున్నారు. 7 నుంచి 9 మంది అందుబాటులో ఉండాలి. అయితే కొన్నిచోట్ల డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉంటున్నారు. మిగిలిన వారు వివిధ రకాల సర్వేలు, ప్రభుత్వ కార్యక్రమాలంటూ బయటికెళ్తున్నారు.

**రూ.36 కోట్లతో నిర్మాణం**

సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, ముత్తుకూరు, తోటపల్లిగూడూరు, మనుబోలు, వెంకటాచలం మండలాల్లో సచివాలయాల నిర్మాణం కోసం గత ప్రభుత్వం రూ.36.40 కోట్లు వెచ్చించింది. ప్రతి సచివాలయంలో 9 నుంచి 12 మంది ఉద్యోగులను నియమించి ప్రజలు గ్రామాలు దాటి వెళ్లకుండా సేవలను అందించారు. నియోజకవర్గంలో 88,362 ఇళ్లకు సంబంధించి 91 సచివాలయాలను ఏర్పాటు చేసి ఎక్కడికక్కడ సమస్యలను పరిష్కరించారు. సుమారు 536 సేవలను సచివాలయాల్లో నాడు అందుబాటులోకి ఉంచారు. ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా కాళ్లరిగేలా తిరిగే అవకాశం ప్రజలకు లేకుండా పోయింది. ఇప్పుడు సేవల్లేవు. సిబ్బంది అందుబాటులో ఉండటం లేదంటున్నారు.

**అందని వైద్యం**

వృద్ధులు, దివ్యాంగుల వైద్యం కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ప్రాథమిక వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చింది గత ప్రభుత్వం. నేడు విలేజ్ హెల్త్ క్లినిక్‌లను సచివాలయాల పక్కనే నిర్వహిస్తున్నా పూర్తి స్థాయిలో మందులు, పరీక్షలు అందుబాటులో లేవు. గత ప్రభుత్వంలో 105 రకాల మందులు పేదల కోసం అందుబాటులో ఉంచగా ఇప్పుడు 70 రకాల మందులను ఇవ్వడమే గగనంగా మారింది. నాడు 15 రకాల పరీక్షలు విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో ఉండగా ఇప్పుడు 5 రకాల పరీక్షలను మాత్రమే చేస్తున్నారు. గ్రామీణ వైద్యం ఆటకెక్కే పరిస్థితి దాపురించింది.

### సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం



గత ప్రభుత్వంతో పోల్చి చూస్తే ఇప్పుడు సచివాలయ వ్యవస్థ నిర్వీర్యమైంది. ప్రజలకు పనులు జరగడం లేదు. సిబ్బంది సక్రమంగా అందుబాటులో ఉండటం లేదు. సర్టిఫికెట్లు సకాలంలో అందజేయడం లేదు.

– ఎ.తులసీ యాదవ్, జట్లకొండూరు, మనుబోలు మండలం

### ఇబ్బందిగా మారింది



గత ప్రభుత్వంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలిసి ఇంటికొచ్చి సేవలందించేవారు. ఇప్పుడు సచివాలయాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా మారింది. కూటమి ప్రభుత్వం పథకాలు అమలు చేయకపోవడంతో సచివాలయాలు, రైతు సేవా కేంద్రాలతో పని లేకుండా పోయింది.

– దేగా శ్రీనివాసులు, రైతు, తాటిపర్తిపాళెం, వెంకటాచలం మండలం

### రేషన్ కార్డులో పిల్లల పేర్ల కోసం కష్టాలు



గతంలో వలంటీర్ల పుణ్యమానని ఏ పనైనా జరిగేది. అయితే ఇప్పుడన్నీ కష్టాలే ఎదురవుతున్నాయి. రేషన్ కార్డులో మార్పులు, చేర్పుల ప్రక్రియ సచివాలయం వద్ద ప్రస్తుతం జరుగుతోంది. అయితే ఇందులో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక్క సంక్షేమ పథకం రావడంలేదు

- పోతురాజు పెంచలమ్మ, కోవూరు

### తల్లికి వందనానికి మంగళం



గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల్లేక పిల్లలు అల్లాడిపోతున్నారు. తల్లికి వందనానికి మంగళం పాడారు. మరికొద్ది రోజుల్లో నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్నా, దీనిపై అతీగతీ లేదు. గత ప్రభుత్వ హయాంలో నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చలువతో అన్ని సంక్షేమ పథకాలు అందేవి. ప్రస్తుతం ఆ పరిస్థితే లేదు.

- మోచర్ల శ్రీనివాసులు, పడుగుపాడు, కోవూరు

## క్లుప్తంగా

### న్యాయస్థానాలపై నమ్మకం ఉంది



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి న్యాయం జరుగుతుందని, కోర్టులపై పూర్తిగా నమ్మకం ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మల్లి నిర్మల పేర్కొన్నారు. కాకాణి కుటుంబీకులను డైకస్‌రోడ్డులోని వారి నివాసంలో బుధవారం కలిసిన అనంతరం ఆమె మాట్లాడారు. గతంలో జెడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎంతో గౌరవంతో వ్యవహరించే వారని చెప్పారు. పేదలకు హానిచేసేతత్వం ఆయనది కాదని తెలిపారు. ఆయనకు తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు.

### రీసర్వేకు సహకారం తప్పనిసరి


పరిశీలిస్తున్న అనూష

కోవూరు: మండలంలోని వేగూరులో నిర్వహిస్తున్న భూముల రీ సర్వే కార్యక్రమానికి రైతులు పూర్తిస్థాయిలో సహకారం అందించాలని ఆర్డీఓ అనూష కోరారు. మండలంలోని వేగూరులో జరుగుతున్న భూ రీసర్వే కార్యక్రమాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ నిర్మలానందబాబా, రీ సర్వే డీటీ మధుసూదన్‌రావు, సర్వేయర్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### బాలలు యాచిస్తూ కనిపిస్తే చర్యలు

- కలెక్టర్ ఆనంద్


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: బడిలో చేర్పించిన బాల యాచకులు తిరిగి ఆ వృత్తిలో కనిపిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై సంబంధిత అధికారులతో నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చేపట్టిన చర్యలను ఆరా తీశారు. పిల్లల దత్తత విషయంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మిక నిరోధక చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ముఖ్యమైన ప్రదేశాల్లో గుర్తించిన బాల యాచకులను బడిలో చేర్పించాలన్నారు. ఇందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి, జెడ్పీ సీఈఓ, ఐసీడీఎస్ పీడీ సంయుక్త సమావేశాలు నిర్వహించి బడి ఈడు పిల్లలందరూ బడుల్లో చేరేలా చూడాలన్నారు. పాఠశాలలు ప్రారంభించడానికి కొద్ది సమయం ఉన్నందున ఈలోపు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. అలాగే కేజీబీవీల్లో డ్రాపౌట్ అయిన వారిని దగ్గర్లోని కళాశాలల్లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోక్సో కేసులు తదితర వాటి గురించి సమీక్షించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ సువర్ణ, డీసీపీఓ సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, సమగ్రశిక్ష పీడీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### వృద్ధుడి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): వృద్ధుడి అదృశ్యంపై కేసును సంతపేట పోలీసులు బుధవారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నాలుగో మైలు టిడ్కో కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం మనవడికి తీవ్ర కడుపునొప్పి రావడంతో బృందావనంలోని రామచంద్రారెడ్డి హాస్పిటల్లో చేర్పించారు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం దంపతులు మనవడి వద్దే ఉంటున్నారు. ఈ తరుణంలో హాస్పిటల్ నుంచి ఆదివారం బయటకొచ్చిన ఆయన అదృశ్యమయ్యారు. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఆయన భార్య అనూరాధ ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### రేపట్నుంచి క్రికెట్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో క్రికెట్ జట్లను శుక్ర, శనివారాల్లో ఎంపిక చేయనున్నామని క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ సొంత కిట్, ఆధార్‌కార్డుతో ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని కోరారు. డ్రెస్ కోడ్‌ను పాటించాలని సూచించారు.

## జిల్లా జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా జైల్లో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఖైదీలతో మాట్లాడి యోగక్షేమాలు తెలుసుకున్నారు. భోజన వసతి, వైద్య సదుపాయాల గురించి ఆరాతీశారు. జైల్లో పారా లీగల్ వలంటీర్‌ను నియమించడం జరిగిందని, వారి ద్వారా సమస్యలను అర్జీల రూపంలో చెబితే పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర విజయవంతానికి పిలుపు


మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వెంకటాచలం: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) వీసీ అల్లం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్ద నున్న వర్సిటీలో బుధవారం వివిధ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో నిర్వహించిన సమావేశంలో వీసీ మాట్లాడారు. ఆధునిక జీవనశైలి, ఒత్తిడితో కూడిన దినచర్యల కారణంగా అనేకమంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో యోగా శాశ్వత పరిష్కార మార్గమని తెలియజేశారు. జూన్ 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన షెడ్యూల్ ప్రకారం రోజూ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. యోగాంధ్ర వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు

- పద్మావతినగర్ వాసుల అవస్థలు

పొదలకూరు: కొద్దిరోజులుగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడి పట్టణంలోని పద్మావతినగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం అంతరాయం ఉంటున్నట్టు ఈ ప్రాంతవాసులు వెల్లడిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతున్న ఓవర్ లోడ్ వల్లే ఫీజులు పోతున్నట్టు తెలుస్తోంది. పట్టణమంతా విద్యుత్ సరఫరా ఉన్నా ఒక్క పద్మావతినగర్ వాసులకే నిలిచిపోతోంది. అంతేకాక గంటలో నాలుగైదు పర్యాయాలు అంతరాయాలు ఏర్పడటం వల్ల ఇంట్లో విలువైన విద్యుత్ సామగ్రి కాలిపోతాయని వినియోగదారులు భయపడుతున్నారు. గతంలో ఇలాగే ఉంటే స్థానికుల ఫిర్యాదు మేరకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అయితే అందులో లోపాలు ఏర్పడుతున్నట్టు తెలుస్తోంది. వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించి రిపేర్లు చేపట్టాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

## యోగాతో ఒత్తిడి దూరం


బుచ్చిరెడ్డిపాళెంలో..


విద్యార్థుల యోగాసనాలు

మనుబోలు: యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరమవుతుందని ట్రైనర్ వెన్నెల అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అక్కంపేట గ్రామంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయొచ్చన్నారు. కార్యక్రమంలో నారాయణ, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: యోగాను జీవితంలో భాగం చేసుకోవాలని బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మనుబోలు: మండల కేంద్రంలోని వైఎస్సార్ కూడలి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నయ్య అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక అరుంధతివాడకు చెందిన చిన్నయ్య పని ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు హైవే దాటుతుండగా నెల్లూరు నుంచి గూడూరు వైపు వస్తున్న మోటార్‌బైక్ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

### వైఎస్సార్‌సీపీ నేత మృతి

ఇందుకూరుపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి పార్టీ మండలాధ్యక్షుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

### సీపీఎం సమైక్యత యాత్రలు



కోవూరు: పట్టణంలోని బజార్ సెంటర్ నుంచి మందబయలు సెంటర్ వరకు సమైక్యత యాత్రలను సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శేషయ్య, గండవరపు బుజ్జయ్య, గుంజి దయాకర్, శ్రీనివాసులు, హరి, అఫ్రోజ్, బాబు, సర్దార్, చాన్‌బాషా, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

### మహిళ మెడలో చైన్ అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మహిళ మెడలో నుంచి బంగారు చైన్‌ను గుర్తుతెలియని దుండగుడు లాక్కెళ్లిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. విజయవాడకు చెందిన శాంతి బుచ్చిరెడ్డిపాళెంలో ఓ వేడుకకు హాజరయ్యారు. అనంతరం పట్టణంలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్లి, రిజిస్ట్రార్ కార్యాలయ సెంటర్ వద్ద దిగి నడుచుకొని వెళ్లసాగారు. వెనుక నుంచి బైక్‌పై వేగంగా వచ్చిన ఓ వ్యక్తి ఆమె మెడలోని ఆరు సవర్ల బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసరెడ్డి దర్యాప్తు చేస్తున్నారు.

## అసైన్డ్ భూములకు నష్టపరిహారం

- నెల్లూరు ఆర్డీఓ నాగఅనూష


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

పొదలకూరు: నడికుడి – శ్రీకాళహస్తి రైల్వే లైన్ నిర్మాణం కోసం సేకరిస్తున్న భూముల్లో అసైన్డ్ భూములున్న రైతులకు కూడా నష్టపరిహారం అందజేస్తామని నెల్లూరు ఆర్డీఓ నాగఅనూష తెలిపారు. మండలంలోని అంకుపల్లి, దుగ్గుంట, వావింటపర్తి గ్రామాల్లో రైల్వే లైన్ నిర్మాణంలో అసైన్డ్ భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మూడు గ్రామాల్లో మొత్తం 20.41 ఎకరాల అసైన్డ్ భూములు రైల్వే లైన్‌కు అలైన్‌మెంట్ చేసినట్టు తెలిపారు. ఇందులో అంకుపల్లి 25 మంది రైతుల 16.6 ఎకరాలు, వావింటపర్తి ఇద్దరు రైతుల 1.58 ఎకరాలు, దుగ్గుంట ఐదుగురు రైతుల 2.77 ఎకరాలు సేకరించినట్టు వెల్లడించారు. ఎకరాకు రూ.4 లక్షలు అందజేయడం జరుగుతుందని, పంటలు లేదా తోటలు ఉంటే ప్రత్యేకంగా పరిహారం ఇస్తామన్నారు. కొందరు రైతులు నష్టపరిహారం చాలదని న్యాయస్థానాలను ఆశ్రయించినట్టు తెలిపారు. పట్టాభూములున్న రైతులకు అంకుపల్లి, దుగ్గుంటలో ఎకరాకు రూ.6 లక్షలు, వావింటపర్తిలో రూ.7 లక్షలు అందజేయడం జరుగుతుందన్నారు. వావింటపర్తిలో పొలాలు ఆయకట్టులో ఉన్నందున పరిహారం కొంత పెంచడం జరిగిందన్నారు. రైతులు రైల్వేలైన్ నిర్మాణానికి సహకరించి తమ భూములను అందజేయాల్సిందిగా కోరారు. న్యాయస్థానాలకు వెళ్తే నష్టపరిహారం అందడంలో జాప్యం నెలకొంటుందని, రైతులు ఆలోచించుకుని నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ బి.శివకృష్ణయ్య, ఆర్‌ఐ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులు కల్పించాలి : ఎంపీడీఓ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మనుబోలు: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వీలైనంత ఎక్కువమందికి పనులు కల్పించాలని ఎంపీడీఓ జలజాక్షి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఏపీఓ రాజమ్మ, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని చూపించాలన్నారు. పనులు జరిగే చోట కూలీలకు తాగునీటి వసతి కల్పించాలని, రోజుకు రూ.300 వేతనం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పశువుల షెడ్లు, నీటి గుంతలు, అలాగే పొలాల్లో సాగునీటి గుంతలను తవ్వించుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

## ఉత్సాహంగా తిరంగా యాత్ర




బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్ నుంచి పెద్ద బస్టాండ్ వరకు తిరంగా యాత్రను బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టారు. పహల్గామ్ దాడిలో మరణించిన వారికి నివాళులర్పించారు. నేతలు కల్యాణ్‌కుమార్, నేతలు కేశవరావు, శ్రీధర్, కృష్ణయ్య, మోహన్‌బాబు, మాచవరం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## క్షయ నిర్మూలనకు సత్వర చర్యలు

నెల్లూరు రూరల్: జిల్లాలో క్షయ నిర్ధారణ పరీక్షలను నిర్వహించి, వ్యాధి నిర్మూలనకు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఇన్‌టెన్సిఫైడ్ టీబీ క్యాంపెయిన్ పోస్టర్లను కలెక్టరేట్లోని శంకరన్ సమావేశ మందిరంలో బుధవారం ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ సుజాత, లెప్రసీ ఎయిడ్స్, టీబీ నివారణాధికారి ఖాదర్‌వలీ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ఉమామహేశ్వరి, జిల్లా మలేరియా నివారణాధికారి హుసేనమ్మ, కావలి, కందుకూరు ప్రోగ్రామ్ అధికారులు బ్రిజిత, రజని, డీపీఓ రమేష్, డెమో కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.